క్లుప్తంగా

స్వామివారికి బంగారు ఆభరణాల బహూకరణ



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరిదేవికి గుంటూరుకు చెందిన యక్కల అంజనీప్రసాద్, సౌమ్య దంపతులు బంగారు అభరణాలను సోమవారం సమర్పించారు. నిత్యకల్యాణ ఉత్సవ మూర్తులకు బంగారు మంగళసూత్రాలు, బంగారుగొలుసు వెండి ఉత్తరజంధ్యాలు మొత్తం కలిపి లక్షరూపాయల విలువైన ఆభరణాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ, అర్చకుడు కైతేపల్లి సత్య శ్రీలకు అందజేశారు. నిత్యకళ్యాణంలో నూతన ఆభరణాలకు సంప్రోక్షణ, ప్రత్యేకపూజల అనంతరం స్వామివారికి అలంకరించారు.

అనుపాలెంలో రేపు విగ్రహ ప్రతిష్ట



రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీమదేల మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మదేల మహేశ్వరస్వామి విగ్రహంతో పాటు పార్వతీ పరమేశ్వర విగ్రహాలు, వినాయక విగ్రహం, నందీశ్వర విగ్రహం, ఛండీశ్వర విగ్రహం, గోపుర కలశం, జీవ ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నారు. కావున భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామ సభలు



ముప్పాళ్ళ: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఉపాధి హామిపథకం సామాజిక తనిఖీ గ్రామసభలు సోమవారం జరిగాయి. లంకెలకూరపాడు, ముప్పాళ్ళ, గోళ్ళపాడు, మాదల గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన పనులు, కూలీల వేతనాలు తదితర అంశాలపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను గ్రామ సభలో చదివి వినిపించారు. ఏమైనా సమస్యలుంటే గ్రామసభ దృష్టికి తేవాలని కోరారు. గ్రామసభల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఎస్ఆర్ఈజీఎస్ తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక వేడుకలు



నకరికల్లు : మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న శ్రీ మరకతలింగా చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆరోవార్షికోత్సవం వేడుకలు ముగింపు సందర్భంగా సోమవారం విశేషపూజలు చేశారు. ఆలయధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. వినాయకస్వామి వారిని, చంద్రమౌళీశ్వరస్వామి వారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. వార్షికోత్సవ వేడుకలు తిలకించేందుకు సమీపగ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వేదపండితుల ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

ఏపీజీఈ ఏ పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి

సత్తెనపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఏపీజీఈఏ పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సత్తెనపల్లి తాలూకా యూనిట్ ఏపీజీఈఏ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం రిలే నిరాహార దీక్ష శిబిరం నిర్వహించారు. స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దుపరిచి ఓపీఎస్ ను పునరుద్ధరించాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని, 12వ వేతన సవరణము గావించాలని, 11వ పీఆర్సీ అమలులో ఒప్పందాల్లో భాగంగా ఆర్థిక పరమైన బకాయిలను, డీఏ ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్, జిల్లా కోశాధికారి పీటర్ డమియన్, సిహెచ్ బసవకుమారి, బి సంపత్ కుమార్, బి రోశయ్య, బి వి ఎస్ ప్రసాద్, డి నాగేశ్వర నాయక్, సిహెచ్ కృష్ణ ప్రసాద్, ఎస్ కరిముల్లా, పాల్గొన్నారు.

ప్రసూతి వైద్య సేవలు మరింత మెరుగుపడాలి

- మంత్రి అంబటి రాంబాబు
- ఏరియా వైద్యశాల సేవలు, అభివృద్ధి పనులపై సమీక్ష



సమీక్ష చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పూర్తి స్థాయిలో వైద్యుల నియామకం, వనరుల, వసతుల కల్పన జరిగిందని, క్లిష్టమైన కాన్పులు కూడా ఏరియా వైద్యశాలలోనే జరిగేలా, ప్రసూతి వైద్య సేవలు మరింత మెరుగుపడేలా వైద్యులు బాధ్యతాయు తంగా పని చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సోమవారం జరిగిన అభివృద్ధి, వైద్యసేవల సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నేత్ర శస్త్ర చికిత్సలకు సంబంధించిన ఆపరేషన్ థియేటర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇక్కడే ఆపరేషన్‌లు జరిగేలా కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సేవా దృక్పథంతో పనిచేస్తున్నారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య బృందానికి సూచించారు. గతంలో కన్నా ప్రస్తుతం పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియామకం జరిగిందని, సేవా భావంతో సహృదయంతో పని చేసి వైద్యశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నూతనంగా వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లక్ష్మణరావు, గైనకాలజిస్ట్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సుజాతను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంత్రి అంబటి రాంబాబు సత్కరించారు. మంత్రి అంబటి రాంబాబును వైద్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. సమీక్ష సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ, ఆర్ఎంఓ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, డాక్టర్ సుష్మ, వైద్యశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

భవిష్యనిధి పై అవగాహన తప్పనిసరి

భవిష్య నిధి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్



మాట్లాడుతున్న భవిష్య నిధి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్

సత్తెనపల్లి: భవిష్య నిధి పై కనీస అవగాహన తప్పనిసరిగా ఉండాలని భవిష్య నిధి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎమ్.చంద్రశేఖర్ అన్నారు. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి పట్టణంలో నిధి ఆప్కే నిఖట్‌లో భాగంగా గుంటురు భవిష్య నిధి కార్యాలయం వారు స్థానిక ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల వారి సౌజన్యంతో డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మీ సమీపంలోని భవిష్య నిధి పేరు తో ప్రావిడెంట్ సభ్యులు, యాజమాన్యం, ప్రతినిధులు అవగాహన, సమస్యల పరిష్కరం కొరకు సోమవారం నిర్వహించిన సధస్సు లో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా భవిష్య నిధి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ ట్లాడుతూ భవిష్య నిధి ద్వారా కలిగే ప్రయోజనాలును సవివరంగా తెలియచేశారు. ఏఏ పనులు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు, ఏవిధంగా ఆన్‌లైన్‌లో భవిష్య నిధి మొత్తాలను చుసుకోవచ్చు అనే విషయాలను వికరించారు. అలాగే సభ్యుడు సర్వీసులు ఉండగా చనిపోతే ఆ సభ్యుని యొక్క కుటుంభ సభ్యులకు భవిష్య నిధి ఎంత మొత్తం వస్తుంది? ఎలా పొందాలి అన్న విషయాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరిండెంట్ ఆర్.నారాయణ, సిబ్బంది జి.శ్రీనివాసరావు, సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్య సేవలు



లక్ష్మీపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 85 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపి 52 మంది, హైపర్ టెన్షన్ 13 మంది, డయాబెటిస్ 9 మంది, గర్భిణులు 11 మంది, ఎనీమియా నలుగురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ ఆరుద్ర గణేష్, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) జే. సంపూర్ణాదేవి, ఏఎన్ఎం బి.జ్యోతి, ఆశా కార్యకర్తలు జి.శివపార్వతి, బీ.పార్వతి, కె. హైమావతి, ఎన్.శారమ్మ, ఎంపీహెచ్ఏ(ఎమ్) షేక్ సుభాని, డిఇఓకే సుధాకర్, తదితరులు ఉన్నారు. అలాగే ధూళిపాళ్ల ఎస్సీ కాలనీలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంతో భాగంగా పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో జనరల్ ఓపి 49 మంది, హైపర్ టెన్షన్ 26 మంది, డయాబెటిస్ 25 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 26 మంది, గర్భిణులు ఆరుగురు, బాలింతలు ముగ్గురు, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఏ.వరలక్ష్మి, ఎమ్ఎల్‌హెచ్‌పీ జి సునీత, ఏఎన్ఎం ఎం.నవీన హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఇఓ జి ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు మరియమ్మ, సుబ్బాయమ్మ, అరుణ ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌లో సచివాలయ సిబ్బంది పాల్గొనాలి

డాక్టర్ కేవీ కృష్ణకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకుమార్

రాజుపాలెం: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తప్పసరిగా పాల్గొనాలని డాక్టర్ కేవీ కృష్ణకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫ్యామిలీ డాక్టర్ విధానంపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు తప్పనిసరిగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పాల్గొనాలని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం జరగబోయే గ్రామంలో ముందుగా గ్రామ వలంటీర్లకు తెలిపి ప్రతీ ఇంటికి తెలియపరచాలని చెప్పారు. ఆగ్రామంలో బీపీ, షుగర్ సంబంధించిన వారి జాబితా వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉండాలని చెప్పారు. మహిళా పోలీసు వారు తప్పనిసరిగా హెల్ శిబిరానికి తీసుకురావాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉదయలక్ష్మీ, ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రసన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలంపాటి అమ్మవారి 39 వ వార్షికోత్సవం

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామంలో వేంచేసి నీలంపాటి అమ్మవారి 39 వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గ్రామంలో ఎస్సీకాలనీలో నిర్మిస్తున్న లూథరన్ చర్చి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎస్సీకాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించి, కేక్ కట్‌చేయనున్నట్లు చెప్పారు. అందరూ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావలసినదిగా ఆయన పిలుపునిచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. పలు ప్రభుత్వ పథకాల అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందని అన్నారు. మండలంలోని అన్నిగ్రామాల ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు 11 గంటలకల్లా హాజరుకావాలన్నారు.

కెనడాలో విద్యార్థి అదృశ్యంపై రెవెన్యూ అధికారుల విచారణ

సత్తెనపల్లి: కెనడాలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామానికి చెందిన విద్యార్థి నిడమానూరు శ్రీధర్ నెల రోజుల కిందట అదృశ్యం కాగా తలిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్ సోమవారం పెద్దమక్కెన గ్రామాన్ని సందర్శించి, శ్రీధర్ తల్లిదండ్రులతో మాట్లాడారు.గ్రామంలో నిర్మిస్తున్న ఇంటి విషయమై నిత్యం తమతో మాట్లాడేవాడని, ఏప్రిల్ 21 నుంచి తమతో ఒక్కసారి కూడా మాట్లాడలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 21న కంపెనీ ఉద్యోగులు ఫోన్ చేసి శ్రీధర్ రెండు రోజుల నుంచి డ్యూటీకి రావడం లేదని చెప్పడంతో శని, ఆదివారం కారణంగా వెళ్లలేదేమోనని భావించామన్నారు. అప్పటి నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. కెనడాలో తమ బిడ్డతో పాటు ఖమ్మంకు చెందిన ఇద్దరు, రాజస్థాన్‌కు చెందిన ఒకరు ఉంటున్నారని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన యువకుడు ఏప్రిల్ మొదటి వారంలో వివాహం చేసుకొని 20న రూమ్ ఖాళీ చేసి వెళ్లాడని వివరించారు. ఖమ్మం విద్యార్థులు పిక్‌నిక్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేయగా రానని శ్రీధర్ చెప్పడంతో ఇద్దరు మాత్రమే వెళ్లారని తెలిపారు. శ్రీధర్‌కు చెందిన మొబైల్, వస్తువులు అన్ని రూమ్‌లోనే ఉన్నాయని, కాని అతడు మాత్రం కనిపించడం లేదని చెప్పారు. దీనిపై కెనడా పోలీసులు విచారణ చేపడుతున్నారని పేర్కొన్నారు. తమ బిడ్డ ఆచూకీ కోసం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవ రాయులును కలువగా ఏపీ భవన్‌కు సమాచారం పంపారన్నారు. బిడ్డ అదృశ్యమై నెల దాటినా ఎలాంటి సమాచారం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బిడ్డ సమాచారం తెలియ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆధైర్య పడవద్దని తహసీల్దార్ నగేష్ సూచించారు. సమాచారాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు పంపుతామని చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ ఆదినారాయణ, వీఆర్వో జయపాల్ ఉన్నారు.

రూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పంపిణీ



స్పోర్ట్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నకరికల్లు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పల్నాడు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ పి.కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో గల శ్రీవెంకటేశ్వరస్కూల్‌లో యూత్ రూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం ద్వారా వారిలో శారీరక ఆరోగ్యం, సృజనాత్మకత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ షేక్.రన్‌సింగ్ హుస్సేన్, లూథరన్ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్, పిఈటి సుదర్శన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌలు రైతుల కార్డుల మంజూరుకు గ్రామసభలు

ముప్పాళ్ళ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కౌలురైతు చట్టం -2019 ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను అర్హులైన కౌలు రైతులకు పంట సాగుపత్రం(కౌలు రైతుకార్డు) మంజూరుకు గాను ఈ నెల 30 నుంచి అవగాహన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ సోమవారం తెలిపారు. మొత్తం 1700 మందికి కౌలు కార్డులు అందించటమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 30న బొల్లవరం, దమ్మాలపాడు, 31న ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, జులై 1న నార్నెపాడు, పలుదేవర్లపాడు, 2వతేదీన గోళ్ళపాడు, లంకెలకూరపాడు, 6వ తేదీన మాదల, ఇరుకుపాలెం, 8వ తేదీన రుద్రవరం, తొండపి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తులు అందించి కార్డులు పొందవచ్చన్నారు.

నేడు బీసీ సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గ్రాండ్ రెసిడెన్సి (అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర) లో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు నియోజవర్గ స్థాయిలో బీసీ సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశం జరుగుతుందని మంత్రి అంబటి రాంబాబు కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, శాసన మండలి సభ్యుడు చంద్రగిరి ఏసురత్నం, మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ , ఇతర ముఖ్య నేతలు హాజరౌతారన్నారు. నియోజక వర్గం లోని బీసీ సామాజిక వర్గ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, హాజరుకావాలని కోరారు.

గణపవరంలో ప్రతిష్ట మహోత్సవాలు ఆరంభం



గణపవరంలో ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న రామాలయం

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో సోమవారం నుంచి ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయంలో విగ్రహ, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం 7న ఉదయం 7.43 గంటలకు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు విష్వక్సేన స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల నాగరాజ భజన సమాజం, శ్రీసాయి బృందం ఆధ్వర్యంలో రాత్రి రామనామ సంకీర్తన నిర్వహించారు. మంగళవారం గ్రామ దేవతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రికి సాతులూరు ప్రసన్నాంజనేయ స్వామి భక్తబృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించనున్నారు. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు మాల్యంవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో యాగశాలలో క్రతువు ప్రారంభించనున్నారు. జూన్ 3 నుంచి 6వ తేదీ వరకూ యాగశాలలో హోమాలు, విగ్రహ ఊరేగింపులు జరగనున్నాయి.

7న చినజియ్యర్ స్వామి రాక...

రామాలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి త్రిదండి చినజీయ్యర్ స్వామి రానున్నారు. 6న గణపవరం రానున్న ఆయన యాగశాలలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. 7న ఉదయం 7.43 గంటలకు జరిగే ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా 50 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు స్వామివారి ధ్రువకల్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో జరగనుంది.

చెస్ పోటీల్లో బాలమనోజ్ గుప్తా ప్రతిభ

సత్తెనపల్లి: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా ఆదివారం విజయవాడలో నిర్వహించిన స్పోర్ట్స్ గేమ్ మీట్– 2023లో చెస్ పోటీల విభాగంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన వాసవి క్లబ్ శ్రీనివాస డైమండ్ సభ్యుడు పచ్చి పులుసు సాయి కుమారుడు పి.బాలమనోజ్ గుప్తా ఇంటర్నేషనల్ స్థాయిలో ద్వితీయ స్థాయిలో నిలిచి ప్రతిభ చూపాడు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి చేతులమీదగా రూ.10 వేలు నగదు, కప్, వాసవి క్లబ్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు. వాసవి క్లబ్ 204 ఏ గవర్నర్ కాజ్జయం విజయలక్ష్మి, ఆర్సీ అడ్డగిరి పార్థసారథి, క్లబ్ ప్రెసిడెంట్ ఐనవోలు కోటేశ్వరరావు, సెక్రటరీ వనమా నాగేశ్వరావు, ట్రెజరర్ గజవల్లి బాజీ, వెలుగురి శరత్, ఏ వెంకటేశ్వరావు, తోమండ్రు సురేష్, ఆత్మకురి హరే చెంచురామయ్య అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్ర భవనానికి శంకుస్థాపన

రాజుపాలెం:మండలంలోని కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీలో అంగనవాడీ కేంద్ర భవనానికి నూతనంగా నిర్మించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు శంకుస్థాపనలో పాల్గొన్నారు. రూ.13.5లక్షలతో భవన నిర్మాణం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓమల్లికార్జునశర్మ,సీడీపీవోటి.లత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్‌కె రమాదేవి పాల్గొన్నారు.

కౌలు రైతుకు గుర్తింపు



భీమవరంలో రైతులకు, కౌలు రైతులకు సాగు కార్డులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

- కౌలు కార్డు మంజూరుకు చర్యలు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు

సత్తెనపల్లి: ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటోంది. అన్నదాత సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోంది. ఈ మేరకు భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తిస్తోంది. వారికి సాగుదారుల హక్కుల చట్టం ద్వారా కౌలు కార్డులు ఇచ్చి మద్దతుగా నిలుస్తోంది. దీంతో కౌలు రైతులకు రైతులతో పాటు సమానంగా ప్రభుత్వం నుంచి లభించే లబ్ధి పొందే వీలు కల్పి స్తోంది. ఈనెల 8వ తేదీ నుంచి అన్ని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేలు)లో వ్యవసాయ శాఖ అధికారులతో కౌలు రైతుల పంట సాగు చట్టంపై అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకూ జరిగింది. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు పంట రుణం పొందడానికి వీలుగా సాగుదారుల కార్డులను ప్రభుత్వం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు చెందిన కౌలు రైతులందరికీ ఈ కార్డు ద్వారా 'వైఎస్సార్ రైతు భరోసా' వర్తిస్తుంది.

కార్డుతో ప్రయోజనాలు ....

- పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు భూమిపై ఎటువంటి హక్కులు లభించవు. అయినప్పటికీ ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పొందవచ్చు.
- పంట సాగుదారు కార్డు భూ యజమానికి, సాగు చేస్తున్న రైతుకీ మధ్య ఒప్పందాన్ని సూచిస్తుంది.
- భూ యజమాని లేదా వారి ప్రతినిధి సాగుదారు గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో) సంతకం ఉండాలి.
- పంట సాగుదారులకు 11 నెలలు మాత్రమే గడువు. తరువాత కొత్త కార్డులు పొందాలి.
- కార్డు దారుడు పంటల పై బ్యాంకు రుణం తీసుకుంటే ఆ రుణం కట్టే బాధ్యత సాగుదారునిది మాత్రమే.
- ఆ వ్యక్తి ఏ కారణం చేత కట్టలేకపోతే భూయజమాని పై ఎటువంటి భారం ఉండదు.

కార్డులు పొందడం ఇలా ..

- రైతులు బాగోగులు చూసే ఆయా గ్రామ వలంటీర్‌కు మీరు భూమిని సాగుకు తీసుకున్న విషయం ముందుగా తెలియజేయాలి.
- ఆ గ్రామ వలంటీర్ పంచాయతీ సచివాలయంలోని గ్రామ పరిపాలన అధికారిని సంప్రదించి సాగుదారు కార్డులకు దరఖాస్తు పొందవచ్చు.
- దరఖాస్తు ప్రక్రియ చాలా సులభం. కార్డుపై యజమాని లేదా ప్రతినిధి సాగుదారు, వీఆర్వోలు సంతకాలు చేస్తే సరిపోతుంది.
- ఈ కార్డు కాపీ ఇద్దరి దగ్గర ఉంటుంది.
- రైతులు సంవత్సర కాలంలో ఖరీఫ్,రబీ సీజన్‌లో ఎప్పుడైనా కార్డులు పొందవచ్చు.
- దరకాస్తుచేసుకున్న 48గంటల్లో కార్డు లభిస్తుంది.
- కార్డు పొందడంలో ఇబ్బంది కలిగితే సమీప తహసీల్దార్ కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



కౌలు రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి. కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధి పొందేందుకు అన్ని ఆర్బీకే కార్యాలయాల్లో అవగాహన కల్పిస్తున్నాం. రైతులు వలంటీర్ల సమన్వ యంతో దరఖాస్తు చేసుకోవాలి.

–ఎస్.శ్రీధర్, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



క్షతగాత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న హరిమిత్ర మండలి సభ్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కత్తెర వెంకట్రావు రైల్వేస్టేషన్ రోడ్ నుంచి టీవీఎస్ మోపెడ్ వాహనం పై వస్తుండగా సబ్‌జైలు సమీపంలో ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్రావుకు మెడ భాగంలో రెండు నరాలు తెగిపోయ్యాయి. స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న హరి మిత్ర మండలి ఆధ్వర్యంలో క్షతగాత్రుడు వెంకట్రావుకు సోమవారం చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హరిమిత్రమండలి సభ్యులు సదనం హరి, తోట స్వామి, కొవ్వూరి సంపత్, మార్తాల నవీన్, సంగం ప్రభాకర్, గోగిరెడ్డి అజయ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.